క్లుప్తంగా

తైబజారు వేలం వాయిదా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ తైబజారు వేలం వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 2023–24 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాట కోసం 9 మంది డీడీలు చెల్లించి పాటలో పాల్గొన్నారు. అయితే కేవలం రూ.8.16 లక్షలకు వేలంపాట పాడటంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. కాగా గత ఏడాది తైబజారు వేలం రూ.19 లక్షలకు పలికింది. ఈ ఏడాది తక్కువగా రావడంతో తైబజారు వేలాన్ని వాయిదా వేశారు. తిరిగి ఈనెల 23న నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

26న జైభారత్ సామాజిక విప్లవ రణభేరి

ఆమనగల్లు: ఈనెల 26న సంగారెడ్డిలో జైభారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట సంస్థల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'జైభారత్ సామాజిక విప్లవ రణభేరి' నిర్వహిస్తున్నట్లు జైభారత్ బీసీ పోరాటవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి రాములు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. సామాజికన్యాయం, కులనిర్మూలన లక్ష్యాలుగా జై భారత్ ఎస్సీ పోరాట వేదిక, జైభారత్ ఎస్టీ పోరాట వేదిక, జైభారత్ బీసీ పోరాట వేదికలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. మూడు సంస్థల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సామాజిక విప్లవ రణభేరిని నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. రణభేరి కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి నిర్మాణానికి చేయూత



మెటీరియల్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన నిరుపేద నాగిళ్ల సాయి ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. సాయి ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను మంగళవారం ట్రస్టు ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగిళ్ల జగన్, కృష్ణ, లక్ష్మయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తుర్కయంజాల్: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. పురపాలక సంఘం పరిధి 10వ వార్డుకు చెందిన గంధం శమంతకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం బాధితురాలికి ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెవుల దశరథ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయానంద్ రెడ్డి, యాదిరెడ్డి, బాలనర్సింహ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం




ఇబ్రహీంపట్నం: ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు

ఇబ్రహీంపట్నం: టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపీపీ మంకు ఇందిర, రాష్ట్ర కార్యదర్శి జలమోని రవీందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి చింతకింది చక్రపాణి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం టౌన్ టీడీపీ అధ్యక్షుడు జక్క రాంరెడ్డి అధ్యక్షతన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోకుల్‌నగర్, పోచమ్మ బస్తీల్లో ప్రచారం నిర్వహించారు. తెలుగు యువత భువనగిరి పార్లమెంట్ అధ్యక్షుడు జక్క కరుణాకర్‌రెడ్డి, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు గోసిక గిరీశం, పీఏసీఎస్ డైరెక్టర్ బొమ్మకంటి అశోక్, ఉపసర్పంచ్ నక్క మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మున్సిపాలిటీలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లయ్య, శ్రీధర్, పూసల వెంకటేశ్, పెంటయ్య, పాండునాయక్, నర్సింహ, జగన్, కుమార్‌గౌడ్, నరేశ్‌యాదవ్, వెంకటేశ్, మణికంఠ, సురేశ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



బాలమ్మ (ఫైల్)

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. వనస్థలి పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్ అంజమ్మ అపార్ట్‌మెంటులో ఉంటున్న నగేశ్ తల్లి బాలమ్మ గత నెల 28న ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. అయితే బాలమ్మ ఎతంతకీ తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడు నాగేశ్ మంగళవారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అంగన్‌వాడీల్లో చిరుధాన్యాలపై అవగాహన



కడ్తాల్: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ అధికారులు

కడ్తాల్: గర్భిణులు, బాలింతలు, బాలికలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం– చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ రామకృష్ణ, సూపర్‌వైజర్ సరళ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నిర్మూలనే లక్ష్యంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అరికలు, పొంగలి, కొర్రలు, సజ్జలు,జొన్నలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని కోరారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం ఆరోగ్యానికి చాల మంచిందని,చిరుధాన్యాలలో మనకు కావల్సిన పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కార్బో హైడ్రెట్స్, ప్రోటిన్స్, ఫైబర్, సాల్ట్స్, మినరల్స్, విటమిన్ బీ12, విటమిన్ బీ6 ఎక్కువగా లభిస్తాయని తెలిపారు. అనంతరం చిరుధాన్యాల ఉపయోగంపై చిత్రాల ద్వార వివరించారు. సర్పంచ్ రామునాయక్, అంగన్‌వాడీ టీచర్ నీలవేణి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు బుజ్జి, భాస్కర్, నాయకులు శత్రు, రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు

మంచాల: చిరుధాన్యాల్లో అధిక పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని కాగజ్‌ఘాట్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఈ సంవత్సరం పోషణ అభియాన్ కార్యక్రమంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. మనం రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు తప్పక తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు తీసుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. చిరుదాన్యాలు తీసుకోవడం వలన కలిగే లాభాల గురించి మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అండాలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పల్లవి, కల్పన, అంగన్‌వాడీ టీచర్లు, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్జాల్ అంగన్‌వాడీ కేంద్రంలో..

తలకొండపల్లి: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబుర్ రహ్మాన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెల్జాల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ–పోషణ అభియాన్‌లో భాగంగా చిరుధాన్యాలతో పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముజీబుర్ రహ్మాన్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే శరీరానికి కావాల్సిన రోజువారీ పోషకాలన్నీ లభిస్తాయన్నారు. ఎదిగే పిల్లలకు చిరుధాన్యాలను ఇవ్వడంతో వారిలో పోషకాహార లోపం తొలగిపోయి శారీరక ఎదుగుదల వేగంగా ఉండే అవకాశాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్, అంగన్‌వాడీ టీచర్ నస్రీన్‌బేగం, భూషణమ్మ, సాయిలు, రాజేందర్ రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులను నిలిపివేయాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం నేతల ధర్నా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా వద్ద మైనింగ్ పనులకు ఇచ్చిన అనుమతులను వెంటనే నిలిపివేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం అఖిలపక్షం నాయకులు, సాకిబండండా రైతులు మైనింగ్ పనులు రద్దుచేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. సాకిబండతండాలో మైనింగ్ పనులు చేపట్టడం వల్ల పచ్చని పొలాలు దెబ్బతింటున్నాయని, మైనింగ్ పనులతో భవిష్యత్‌లో పంటలు పండే అవకాశం లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ పనులు చేపడుతున్న పేలుళ్లతో ఇళ్లకు పగుల్లు వస్తున్నాయని.. మైనింగ్ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కల్వకుర్తి వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, కృష్ణనాయక్, వివిధ పార్టీల నాయకులు గోరటి నర్సింహ, కృష్ణయాదవ్, శ్రీకాంత్‌సింగ్, గన్యానాయక్, నరేందర్‌రాథోడ్, రవిరాథోడ్, రమేశ్, వినోద్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న నాయకులు,గిరిజనులు

పోలెపల్లిలో పశువైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఆమనగల్లు పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు చికిత్సలు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, సర్పంచ్ బాల్‌రాం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దోనాదుల కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సీఐ జాల ఉపేందర్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

ఆమనగల్లు: సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్ కోరారు. బాలికలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బస్టాండ్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మంగళవారం సైబరాబాద్ పోలీసు కళాబృందం, షీ టీం ఆధ్వర్యంలో బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, సెల్‌ఫోన్‌లు, సోషల్‌మీడియా ద్వారా జరిగే అనర్థాలను నాటకాలు, పాటలు, వీడియోల ద్వారా బాలికలకు అర్థమయ్యేలా వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. బాలికల పట్ల ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే తక్షణమే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సోషల్‌మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోరాదని దీనివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, హోలీక్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ఎంఈఓ సర్దార్‌నాయక్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పద్మ, వెంకట్‌రెడ్డి, కళాబృందం ఏఎస్ఐ ప్రమీళ, షీటీం హెడ్ కానిస్టేబుల్ హరికాంత్‌రెడ్డి, కళాబృందంసభ్యులు రాజు, సుదర్శన్, శ్రీనివాస్, నరహరి, వెంకటేశ్, బ్రహ్మం, రజిత, ప్రదీప్, ఆనంద్, నూకాజీ, సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

ఆత్మీయ సమ్మేళనంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకుల ధరలను తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో అవినీతి పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతిని ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కార్యదర్శులు అంజయ్యగుప్తా, గుజ్జుల మహేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, బిచ్చనాయక్, సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీటీసీలు రాములు, వెంకటయ్య, నర్సమ్మ, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, యువజన అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, ఆరీఫ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తండాలో బోరుమోటార్ ప్రారంభం

ఆమనగల్లు: గిరిజన తండాల అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఆమనగల్లు మండల పరిధిలోని కొత్త కుంటతండా గ్రామ పంచాయతీ, పాపర్లబోడు తండాలో గతంలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించిన సమయంలో తండాలో దాహార్తి తీర్చడానికి బోరు వేయించాలని తండావాసులు కోరారు. దీనితో ఇటీవల బోరు డ్రిల్లింగ్ వేయించి మోటార్ బిగించారు. పాపర్లబోడుతండాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బోరుమోటార్‌ను సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జక్‌రాంనాయక్, శంకర్, వెంకట్‌నాయక్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి



ప్రొసీడింగ్ అందజేస్తున్న నిత్యారెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.34 లక్షలు నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను నేతలకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోనే మంచాల మండలం మారుమూల ప్రాంతమన్నారు. గిరిజన తండాలు, బడుగుబలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న మండలమని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల సహకారంతో మంచాల మండల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నామని అన్నారు. మంచాల మండలంలోని కాగజ్ ఘాట్‌లో కంపౌడ్ వాల్ నిర్మాణం కోసం రూ.4లక్షలు, మంచాలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.2లక్షలు, సీసీ రోడ్డు కోసం రూ.2లక్షలు, ఆగాపల్లిలో అండర్ డ్రైనేజికి రూ.4లక్షలు, రంగాపూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.2.5లక్షలు, వైకుంఠదామాల్లో నీటి వసతి కోసం నోములలో రూ.2.5లక్షలు, తాళ్లపల్లి గూడలో రూ.లక్ష, అస్మత్‌పూర్‌లో రూ.2లక్షలు, చెన్నారెడ్డిగూడలో రూ.2.5లక్షలు, కాగజ్‌ఘాట్‌లో రూ.2.5లక్షలు, సత్తి తండా, ఆంబోత్‌తండాలకు రూ.2.5లక్షలు, పటేల్ చెరువు తండాకు రూ.2లక్షలు, రంగాపూర్‌కు రూ.1.5లక్షలు, లింగంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3లక్షలు చొప్పున మంజూరు చేశామన్నారు. ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభించడానికి ప్రొసీడింగ్‌లు కూడా పంపిణీ చేశామన్నారు. మరిన్ని నిధులు తీసుకొచ్చి మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్, నాయకులు శ్రీనివాస్, తౌఫిక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్ జారీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో రూ.3.51 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం విడుదల చేశారు. ఎల్ఆర్ఎస్, 14వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ వార్డుల్లో రూ.3.86 కోట్లతో చేపట్టనున్న పనులకు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతితో గత కొంతకాలంగా అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు విభేదించడంతో వారి మధ్య విబేధాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీకాలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి కౌన్సిలర్లు తీసుకెళ్లారు. అభివృద్ధి పనులకు అటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దశలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, పలువురు కౌన్సిలర్లు మంగళవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిశారు. ఆయా పనులకు సంబంధించి రూ.3.86 కోట్లకుగాను రూ.3.51 కోట్ల పనులకు మాత్రమే ప్రొసీడింగ్స్‌ను ప్రతీక్ జైన్ విడుదల చేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి ఆకుల యాదగిరితోపాటు కౌన్సిలర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడిగా నరేశ్‌గౌడ్

కడ్తాల్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ కడ్తాల్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన బొల్లం నరేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బొల్లం నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. యువజన సంఘాల నాయకుడిగా యువకుల సమస్యలపై ఇప్పటివరకు పనిచేయడం జరిగిందని తెలిపారు. పార్టీ అప్పగించిన నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. దివంగత మహనేత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బాలగౌని శ్రీనివాస్‌గౌడ్, కృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.

కడ్తాల్‌లో వీధిలైట్ల పునరుద్ధరణ

కడ్తాల్: మండల కేంద్రంలో వీధి లైట్ల పునరుద్ధరణ పనులకు గ్రామ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో నాలుగు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో 4, 5,7,9 వార్డుల్లో షార్టు సర్క్యూట్ కారణంగా 70 విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి దీపాలు ఒక్కసారిగా కాలిపోయాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ మేరకు వర్షాలు నిలిచిపోవడంతో మంగళవారం గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పంచాయతీ సిబ్బందితో కలిసి నూతన వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టారు. లైట్ల పునరుద్ధరణ పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహేశ్, సిబ్బంది రాజు, అంజి, వెంకటేశ్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్య సిబ్బంది సౌజన్యంతో ఉప్పల అఖిల్ నేతృత్వంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తలకొండపల్లి జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. శిబిరంలో 411 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఇలాంటి వైద్య శిబారాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్ మాజీ ఎంపీటీసీలు రంగయ్య, యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను, రవి కుమార్, నాయకులు శేఖర్, జోగు రమేశ్, విజయ్, తిరుపతి, ఒగ్గు మహేశ్, రమేశ్‌గౌడ్, రాజు, కృష్ణయ్య, రమేశ్, రాములు, రాంరెడ్డి, వాస్‌దేవ్, వినోద్, సందీప్, దేవేందర్, నరేశ్, ముబీన్, శ్రీను ఉన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

తలకొండపల్లి: మండల పరిధిలోని జూలపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అలివేలు మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అదేవిధంగా వెంకటాపూర్‌తండా కంటి వైద్య శిబిరంలో 148 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్, రవికుమార్, హెచ్ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, నాయకులు విజయ్‌రెడ్డి, సరిత, జంగయ్య, గోవర్దన్, శ్రీధర్, సాయి, సంజీవ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: వైఎస్సార్‌టీపీ

మంచాల: మంచాల మండలంలో వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని వైఎస్సార్‌టీసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వ్యవసాయాధికారి జ్యోతిశ్రీకి వినతిపత్రం అందజేశారు. వడగండ్ల వర్షం కారణంగా మండలంలో బోడకొండ, లోయపల్లి, చీదేడ్, దాద్‌పల్లి, శ్రీమంతన్‌గూడ గ్రామాల్లో చాలావరకు పంటచేలు దెబ్బతిన్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నష్టపరిహారం అందించాలని కోరారు.ఆపార్టీ రాష్ట్ర నాయకుడు జంగయ్య గౌడ్, మండల అధ్యక్షుడు నేనావత్ శ్రీనివాస్, నాయకులు రామారావు పాల్గొన్నారు.